ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 10 డిసెంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm

# ఆర్జీవీకి ఊరట



## మూడు కేసుల్లో బెయిల్

అమరావతి, హైదరాబాద్: వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టుల కేసులో న్యాయస్థానం ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ వివాదంలో ఆర్‌జీవీపై మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో కేసులు నమోదు అయ్యాయి. దీంతో తాను అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ కోసం ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఆయన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు మూడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## భావోద్వేగ క్షణం..
# మన తల్లి అవతరణం

### నాలుగు కోట్ల బిడ్డలం.. రుణం తీర్చుకున్నాం
### సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: భావోద్వేగ క్షణం.. మన తల్లి అవతరణం అని సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. నాలుగు కోట్ల బిడ్డలం.. తీర్చుకున్న రుణం అని అన్నారు. తల్లీ తెలంగాణమా.. నిలువెత్తు నీ రూపం, సదా మాకు స్ఫూర్తిదాయకం అని రాసుకొచ్చారు ముఖ్యమంత్రి. రాష్ట్ర సచివాలయంలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ఎమోషనల్ ట్వీట్ చేశారు.

# పాలన కాదు పీడన

### చరిత్రను చెరిపేస్తాం అన్న భ్రమంలో మీరు ఉన్నారు..
### కాలం రాగానే కాటేసి తిరుతుంది
### మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : ప్రజల వేదన అరణ్య రోదననే మిగిలిందని ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. రైతుల చెరబడితిరి పేదల ఇండ్లు కూల గొడ్తిరి అని రాసుకొచ్చారు ఆయన. రైతుబంధు ఎత్తేస్తిరి రైతుభీమాకు పాతరేస్తిరి. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ మాయం చేస్తిరి .. అమ్మవడిని ఆగం చేస్తిరి.. నిరుద్యోగుల ఉసురు పోసుకుంటిరి .. ఏక్ పోలీస్ అన్న పోలీసులను అణగదొక్కితిరి.. హామీల అమలు అడిగిన ఆడ బిడ్డలు ఆశాలను అవమానపరిస్తిరి.. టీఎస్ టీజీగా చేసి... చార్మినార్, కాకతీయ కళాతోరణాలను తొలగిస్తిరి తెలంగాణ బిడ్డలు లాఠీలకు, తూటాలకు ఎదురొడ్డి .. త్మబలిదానాలతో ఉద్యమిస్తున్నప్పుడు .. సమైక్యవాదుల పంచనచేరి వంచన చేస్తిరి. అధికార అహంకారంతో ఇప్పుడు ఏకంగా అమ్మనే మారిస్తిరి మీరు.. చరిత్రను చెరిపేస్తాం అన్న భ్రమలో .. తెలంగాణ ప్రజలను ఏమారుస్తాం అనుకుంటే పొరపాటు తెలంగాణ అన్నీ గమనిస్తున్నది.. కాలంబు రాగానే కాటేసి తీరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మాకొద్దు ఈ కాంగ్రెస్ తల్లి !

### ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం అన్యాయమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ ప్రత్యేక పండుగ అయిన బతుకమ్మను తొలగించి.. హస్తం పార్టీ గుర్తును పెట్టడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా.. తెలంగాణ భవన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి కార్యకర్తలతో కలిసి ఆమె పాలాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించారు. ఉద్యమ కాలంలో పెద్దలు నిర్ణయించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బతుకమ్మను విగ్రహంలో ఎందుకు చేర్చలేదు? తొమ్మిది మంది కళాకారులను సన్మానిస్తామన్నారని, ఆ జాబితాలో మహిళలు ఎక్కడ? స్ఫూర్తి నింపే తెలంగాణ తల్లి విగ్రహం కాదని.. కాంగ్రెస్ తల్లిని పెట్టుకున్నారన్నారు. ఉద్యమకాలం నాటి ప్రతీకలను అవమానించే యత్నం చేస్తున్నారు. సచివాలయంలో పెట్టిన కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నామని కవిత అన్నారు.

## నా పోరాటం
# ఆత్మగౌరవం కోసం

### మంచు మనోజ్



హైదరాబాద్: తాను ఆస్తి కోసమో, డబ్బు కోసమో పోరాటం చేయడం లేదని సినీనటుడు మంచు మనోజ్ స్పష్టం చేశారు. నన్ను తొక్కేయడానికి భార్య, పిల్లల అంశాన్ని తీసుకొస్తున్నారని ఆరోపించారు. కుటుంబ వివాదం నేపథ్యంలో జల్‌పల్లిలో మనోజ్ విలేకరులతో మాట్లాడారు. నేను చేసేది ఆత్మగౌరవ పోరాటం. ఇది నా భార్య, పిల్లల రక్షణకు సంబంధించిన విషయమన్నారు. తనను అణగదొక్కేందుకు తన భార్యను బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. తన ఏడునెలల పాపను దీనిలోకి లాగడం, పిల్లలు ఇంట్లో ఉండగానే ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. పోలీసుల వద్దకు వెళ్లి రక్షణ కోరానన్నారు.

మోహన్‌బాబు, మనోజ్ ఇద్దరూ పరస్పర ఆరోపణలు చేసుకుంటూ లేఖలు విడుదల చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు తమపై దాడి చేశారని, తనకు, తన భార్యకు ప్రాణహాని ఉందని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో మంచు మనోజ్ సోమవారం ఫిర్యాదు చేశారు. మరోవైపు మనోజ్‌తో తనకు ప్రాణహాని ఉందని మోహన్‌బాబు లేఖ ద్వారా రాచకొండ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంచు మనోజ్ ఆయన భార్య మౌనికపై కేసు నమోదైంది.



### కుటుంబ వివాదం.. స్పందించిన మోహన్‌బాబు

ఏ ఇంట్లోనైనా సోదరుల మధ్య గొడవలు సహజమని ప్రముఖ సినీనటుడు మోహన్‌బాబు అన్నారు. ఇంటి గొడవలను వారు అంతర్గతంగా పరిష్కరించుకుంటారని చెప్పారు. తమ ఇంట్లోనూ అలాంటి విభేదాలు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించుకుంటామని తెలిపారు. కుటుంబ వివాదం నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నో కుటుంబాల సమస్యలను తాను పరిష్కరించినట్లు మోహన్‌బాబు చెప్పారు. చాలా కుటుంబాలు కలిసేలా చేశానన్నారు.

# రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం?

న్యూఢిల్లీ : తమ పట్ల వివక్షా వైఖరిని ప్రదర్శిస్తున్న రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు యోచిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన తీర్మానంపై 50 మంది ప్రతిపక్ష ఎంపీలు సంతకం చేసినట్టు ఆ వర్గాలు సోమవారం తెలిపాయి. రాజ్యసభ నుంచి తాము తరచు వాకౌట్ చేయాల్సిన పరిస్థితికి చైర్మన్ ధన్‌ఖర్ వైఖరే కారణమని విపక్ష ఎంపీలు ఆరోపిస్తున్నారు. తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు చైర్మన్ తగినంత సమయాన్ని కేటాయించడం లేదని వారు భావిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి.

# ముంబైలో ఘోర రోడ్డు ప్రమాదం

### పాదచారులపైకి దూసుకెళ్లిన బస్సు..
### ఆరుగురు దుర్మరణం

ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బెస్ట్ బస్సు అదుపుతప్పి పాదచారులపైకి దూసుకెళ్లిన ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 49 మంది గాయపడ్డారు. సోమవారం రాత్రి కుర్లా నుంచి అంధేరికి వెళ్తున్న బెస్ట్ బస్సు బుద్ధ కాలనీ వద్ద బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో పాదచారులు, కొన్ని వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగ్రాతులను దవాఖానకు తరలించారు. అనంతరం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోని విచారణ చేపట్టారు. బ్రేక్ ఫెయిల్ కావడంతోనే బస్సుపై అతడు నియంత్రణ కోల్పోయాడని చెప్పారు. కాగా, బస్సును అతివేగంతో నడిపినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సు కొత్తదేనని, మూడు నెలల క్రితమే రిజిస్ట్రేషన్ అయిందని ప్రాంతీయ రవాణా అధికారి పేర్కొన్నారు.

